క్లుప్తంగా

21 గ్యాస్ సిలిండర్లు సీజ్



స్వాధీనం చేసుకున్న గ్యాస్ సిలిండర్లను చూపుతున్న అధికారులు, సిబ్బంది

కడప అర్బన్: కడప రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ జి. శ్రీనివాసరావు ఆదేశాల మేరకు సోమవారం ఉదయం కడప నగరంలోని చిలకలబావి జీ.ఎం ఫంక్షన్‌హాల్ వద్ద మిట్టా సుబ్బనరసయ్య అనే వ్యక్తి గృహ అవసరాలకు సంబంధించిన గ్యాస్ సిలిండర్లను అక్రమంగా విక్రయిస్తుండగా విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. విజిలెన్స్ అధికారులతో పాటు సివిల్ సప్లై అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిట్టా సుబ్బనరసయ్య నుంచి 21 గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. ఆ వ్యక్తిపై నిత్యావసర సరుకుల చట్టం 1955 మేరకు 6(ఏ) కేసు నమోదు చేశారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ అధికారులైన డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ బి. గీతావాణి, కడప మునిసిపల్ కార్పొరేషన్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ దక్షిణ రామ్మూర్తి, సీఎస్‌డీటీ మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 50 ఏళ్లకే పెన్షన్ ఇవ్వాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: బీసీలకు 50 సంవత్సరాలకే నెలకు రూ.4వేలు పెన్షన్ ఇవ్వాలని డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి పేర్కొన్నారు. సోమవారం నగరంలోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రజాగళం ఉమ్మడి మేనిఫెస్టో 2024 ప్రకారం బీసీ డిక్లరేషన్ పేరిట బీసీలకు 50 సంవత్సరాలకే నెలకు రూ.4000 పెన్షన్ ఇస్తామన్నారు, కానీ ఇంతవరకు అమలు చేయలేదన్నారు. బీసీల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తెస్తామన్నారు కానీ ఇంతవరకు అటువంటి కార్యక్రమం చేయలేదన్నారు. బీసీ సబ్ ప్లాన్ ద్వారా ఐదేళ్లలో రూ.లక్షన్నర కోట్లు ఖర్చు చేస్తామన్నారు.. అధికారంలోకి వచ్చి దాదాపు 9 నెలలు అయిందని ఇంతవరకు అటువంటి ప్రణాళిక ఏమీ లేదని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో సిటీ అధ్యక్షులు అఫ్జల్ ఖాన్, కడప అసెంబ్లీ కోఆర్డినేటర్ బండి జకరయ్య, పి.డి. సంజయ్ కాంత, మైనుద్దీన్, మామిళ్ళ బాబు, రఫీక్ ఖాన్, హమీద్ పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలు ఇవ్వాలి

కడప సెవెన్‌రోడ్స్ : ఎస్సీ ఎస్టీ మైనార్టీలకు సబ్సిడీ రుణాలు మంజూరు చేసేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి కానగల మునెయ్య కోరారు. సోమవారం జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడును కలిసి వినతిపత్రం సమర్పించారు. సంక్షేమ పథకాలు పునరుద్ధరిస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తొమ్మిదినెలలైనా వాటిని పట్టించుకోలేదన్నారు. బడ్జెట్‌లో సరిపడ నిధులు కూడా కేటాయించకపోవడం అన్యాయమన్నారు. కూటమి పార్టీల్లో ఉన్న ఎస్సీ ఎస్టీ ఎమ్మెల్యేలు సబ్సిడీ రుణాలపై ప్రభుత్వం వద్ద మాట్లాడే పరిస్థితి కూడా లేదన్నారు. అసెంబ్లీ సాక్షిగా మంత్రి బాల వీరాంజనేయస్వామి ఇచ్చిన హామీ నేటికీ అమలు కాకపోవడం విచారకరమన్నారు. ప్రభుత్వ వైఖరి ఇలాగే కొనసాగితే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తగు రీతిలో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా నాయకులు మనోహర్, చంద్రగుప్తా పాల్గొన్నారు.

యువకుడి అరెస్ట్

కడప అర్బన్: కడప నగరంలోని ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ ఆసుపత్రిలో పనిచేస్తున్న యువతిని ప్రేమపేరుతో గణేష్ అనే యువకుడు మోసం చేశాడు. అతడిపై కేసు నమోదు చేసిన పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు.

బహిరంగ విచారణకు సిద్ధం

కడప రూరల్: మాజీ సైనికుడు కేవీ రావు తనపై వచ్చిన ఆరోపణల్లో నిజం లేదంటూ బహిరంగ విచారణకు సిద్ధం అని చెప్పారని, అయితే అందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు ఎక్స్ సర్వీస్‌మెన్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జడ్ ఫిలిప్స్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రమ శిక్షణ గల సైనికులు ఎవరూ అక్రమాలకు పాల్పడరని అన్నారు. అందరూ మాజీ సైనికుల సంక్షేమానికి కృషి చేయాలన్నారు. అయితే కేవీ రావుపై పలు ఆరోపణలు ఉన్నాయని వాటిని బహిరంగ విచారణలో ఆధారాలతో సహా బయట పెడుతామని తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్య

కడప అర్బన్: కడప నగరంలోని తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో ఐటీ సర్కిల్ సమీపంలో నివాసముంటున్న సుభాన్ బీ (22) అనే వివాహిత కుటుంబంలో ఏర్పడిన మనస్పర్థలతో విషద్రావణం తాగి సోమవారం ఆత్మహత్యకు పాల్పడింది. కడప తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

– కడప చిన్న చౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలో యానాది కాలనీకి చెందిన చెంద్రరాయుడు (27) అనే యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సమస్యల వల్ల ఈ చర్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. చిన్న చౌక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

బాల్య వివాహాలను అరికడదాం

కడప కోటిరెడ్డిసర్కిల్/కల్చరల్ : బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ పీడీ దేవిరెడ్డి శ్రీలక్ష్మి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా ప్రజలను చైతన్యవంతులను చేస్తూ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించడంతో పాటు సంతకాల సేకరణ చేశారు. సాయంత్రం హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మత పెద్దలు, మహిళా సంఘాల మహిళలతో కలెక్టరేట్ నుంచి మహావీర్ సర్కిల్ వరకు జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా మార్చేందుకు పిలుపునిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ కమిషనర్, మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్, స్వయం సహాయక సంఘాల మహిళలు, వన్‌స్టాప్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగుల బైక్ ర్యాలీ

ప్రొద్దుటూరు : ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మహిళా ఉద్యోగులు బైక్ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు సీడీపీఓ హైమావతి, మెప్మా టీఈ మహాలక్ష్మి ఆధ్వర్యంలో ఉద్యోగులు బైక్ ర్యాలీ జరిగింది. మున్సిపల్ కార్యాలయం నుంచి గాంధీ రోడ్డు, టీబీ రోడ్డు, పుట్టపర్తి సర్కిల్ వరకు ర్యాలీ సాగింది. ఆడ పిల్లలను రక్షిద్దాం – ఆడ పిల్లలను చదివిద్దాం నినాదాలు చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, సీఓలు, ఆర్పీలు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ రూరల్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి ఈ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా సీడీపీఓ అరుణ కుమారి ఆధ్వర్యంలో మహిళల హక్కులను కాపాడుతామని, వారి సంక్షేమానికి, రక్షణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కడప నగరంలో కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న ఐసీడీఎస్ అధికారులు, ఇతర శాఖల మహిళా సిబ్బంది

అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి



డీఈఓకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కడప ఎడ్యుకేషన్: ఓపెన్ ఇంటర్ పరీక్షలలో అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం డీఈఓ షంషుద్దీన్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న మాట్లాడుతూ జిల్లాలోని మైదుకూరు, పొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేల్ ప్రాంతాల్లోని ఓపెన్ ఇంటర్ పరీక్షల్లో విద్యార్థులను పాస్ చేయిస్తామని చెప్పి విచ్చల విడిగా ప్రైవేటు స్టడీ సెంటర్ నిర్వాహకులు, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్లు విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. ఈ విషయంలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు బాలాజీ, విష్ణు, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

కంటి ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : విద్యార్థులు కంటి ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇచ్చేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తగిన చర్యలు చేపట్టాలని ఎల్వీపీఈఐ వైద్యులు డాక్టర్ శశి బిందు, తిప్పన్నలు సూచించారు. ఈ మేరకు 'విద్యార్థులు–వారి కంటి ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు' అనే అంశంపై సోమవారం నగరంలోని ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ వైఎస్‌ఆర్ క్యాంపస్‌లో నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. విద్యా సంవత్సరం ముగుస్తున్న సమయంలో విద్యార్థులు పరీక్షలకు సిద్ధపడుతున్న సమయంలో కంటి ఆరోగ్యం ఎంతో ముఖ్యమన్నారు. ఎక్కువ గంటలు చదువుతూ ఉండే ఈ సమయం ఆందోళన, ఒత్తిడితో కూడుకున్నదన్నారు. సుదీర్ఘమైన అధ్యయన సెషన్లతోపాటు డిజిటల్ అభ్యాసం, స్క్రీన్ సమయం ఫలితంగా విద్యార్థులు కంటి అలసట బారిన పడుతున్నారన్నారు. ఈ క్రమంలో కంటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. చిన్న సమస్య వచ్చినా వైద్యులను సంప్రదించాలన్నారు.

శనగలకు మద్దతు ధర ప్రకటించాలి

ఎర్రగుంట్ల : పప్పుశనగకు కనీస మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వమే మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎంవి సుబ్బారెడ్డి కోరారు. సోమవారం రైతులతో కలసి తాహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కష్టపడి పండించిన పంటచేతికి వచ్చే సరికి దళారులు క్వింటా రూ.5,000 నుంచి రూ.5,500 కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. సబ్సిడి పప్పు శనగ విత్తనాలు క్వింటా రూ.7,200 ప్రభుత్వం అందించిందన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతు తాహసీల్దార్ శోభన్‌బాబుకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షుడు ఇల్లూరు కృష్ణారెడ్డి, సీపీఐ నియోజకవర్గ సమితి కార్యాదర్శి నారాయణ, రైతులు పాల్గొన్నారు.

మద్దతు ధర ప్రకటించాలి

పెండ్లిమర్రి: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలు, పండించిన పంటలను మద్దతు ధర కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి. అన్వేష్ డిమాండ్ చేశారు. సోమవారం పెండ్లిమర్రిలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా అన్నదాత సుఖీభవ పథకం క్రింద ఏడాదికి రూ.20వేలు పెట్టుబడి సాయం అందించాలన్నారు. అలాగే భూమి లేని నిరుపేదలకు భూపంపిణీ అమలు చేయాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహశీల్దార్ నరసింహులుకు అందజేశారు.

వైఎస్సార్‌సీపీ పురోభివృద్ధికి కృషి

ప్రొద్దుటూరు : వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ పురోభివృద్ధికి కృషి చేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. దొరసానిపల్లెలోని రాచమల్లు ఇంటికి సోమవారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి వచ్చారు. ఈ సందర్భంగా కొత్తగా పార్టీ పదవులు పొందిన వారిని రాచమల్లు.. రవీంద్రనాథ్‌రెడ్డికి పరిచయం చేశారు. అనంతరం రాచమల్లు మాట్లాడుతూ ప్రొద్దుటూరు నియోజకవర్గానికి సంబంధించి త్వరలో పార్టీ కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు అన్ని కులాల వారికి ప్రాధాన్యం ఇస్తూ పార్టీ పదవులు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రజల పక్షాన పోరాడేందుకు నిరంతరం సిద్ధంగా ఉన్నామన్నారు. యువతతోపాటు అనుభవం, పార్టీ పట్ల నమ్మకస్తులైన వారిని కలుపుకొని నియమించడం జరిగిందన్నారు. త్వరలో మున్సిపల్ చైర్‌పర్సన్, ఎంపీటీసీ, జెడ్పీటీసీలతోపాటు పార్టీ పదవులు పొందిన వారితో కలిపి విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తామన్నారు. జిల్లాకే ఈ సమావేశం మార్గదర్శకంగా ఉంటుందన్నారు. ఈ సమావేశానికి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డితోపాటు మిగిలిన 5 నియోజకవర్గాల మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు హాజరవుతారన్నారు. పార్టీ ఓటమి అనంతరం కార్యకర్తలకు ఏమైనా ఇబ్బందులు జరిగాయా, పోలీసుల నుంచి ఒత్తిడి ఎదుర్కొంటున్నారా, కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారా అనే విషయాలపై సమావేశంలో చర్చించడం జరుగుతుందన్నారు. వ్యక్తిగత ఇబ్బందులను తెలుసుకుని వారికి మానసిక ధైర్యాన్ని కల్పిస్తామన్నారు. రెండో మారు వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తెచ్చి వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రధానంగా కార్యకర్తలకు ఎక్కడ భంగం కలిగిందో, ఆ గౌరవాన్ని, ఆనందాన్ని తిరిగి అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. అన్నిటి కంటే పార్టీ క్యాడర్‌కు ప్రాధాన్యత ఇస్తామన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ ఆయిల్ మిల్ ఖాజా, పాతకోట బంగారు మునిరెడ్డి, వైఎస్సార్‌సీపీ పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు కల్లూరు నాగేంద్రారెడ్డి, వైఎస్సార్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు ఖాజాపీర్, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు వంశీధర్ రెడ్డి, మండల అధ్యక్షుడు మార్తల చంద్ర ఓబుళరెడ్డి, తొగటవీరక్షత్రియ సంఘం జిల్లా అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ, కౌన్సిలర్లు, ఇతర నేతలు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డితో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి

ప్రజా సమస్యలను సకాలంలో పరిష్కరించాలి

కడప కార్పొరేషన్: ప్రజా సమస్యలను సకాలంలో పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ మనోజ్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం «ప్రజా సమస్యల పరిష్కార వేదిక» కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వచ్చిన అర్జీలను విభాగాధిపతులు పరిశీలించి, క్షేత్రస్థాయికి వెళ్లి న్యాయ పద్ధతిలో పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం 33 అర్జీలు రాగా, అందులో ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి–13, టౌన్‌ప్లానింగ్–7, హెల్త్ విభాగం–5, ఎస్టాబ్లిష్‌మెంట్–1, రెవెన్యూ విభాగానికి సంబంధించిన అర్జీలు–7 వచ్చాయి.

– కడప నగరం 20వ డివిజన్ పరిధిలోని మారుతీనగర్‌లో పాత ఎంప్లాయిమెంట్ కార్యాలయం ఎదురుగా ఉన్న రోడ్డులో నెల రోజులుగా కంకర, ఇసుక, మట్టి రోడ్డుపై ఉండటం వల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆ డివిజన్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి శ్రీరంజన్‌రెడ్డి, కిరణ్ కమిషనర్ దృష్టికి తెచ్చారు. ఆ రోడ్డు 2024లో మంజూరైందని, ఈ మేరకు కాంట్రాక్టర్ కంకర, ఇసుక వంటివి తోలి ఉంచారని, అయితే కొందరు ఆ పనులు చేయకుండా అడ్డుకుంటున్నారన్నారు. వెంటనే పనులు మొదలు పెట్టి రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగరపాలక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న 20వ డివిజన్ ఇన్‌చార్జి శ్రీరంజన్‌రెడ్డి, కిరణ్

వైవీయూలో ఉత్సాహంగా క్రీడా పోటీలు

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయ కాలేజ్ డే, ఫౌండేషన్ డే సందర్భంగా కళాశాల అంతర విభాగ క్రీడా పోటీలలో భాగంగా సోమవారం జరిగిన విద్యార్థుల క్రికెట్ ఫైనల్ పోటీలను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పుత్తా పద్మ ప్రారంభించారు. ఈ పోటీలలో ఎర్త్ సైన్స్, బయోటెక్నాలజీ అండ్ బయోఇన్ఫర్మేటిక్ జట్టు విజయం సాధించి మొదటి స్థానంలో నిలిచింది, ద్వితీయ స్థానంలో మేనేజ్‌మెంట్ స్టడీస్ (ఎంబీఏ) జట్టు నిలిచింది. నాన్ టీచింగ్ ఫైనల్ మ్యాచ్‌లో గ్రీన్ కింగ్స్ లెవెన్ జట్టు విజయం సాధించింది. వేమన వారియర్స్ జట్టు రెండవ స్థానంలో నిలిచింది. విజేతలను రిజిస్ట్రార్ పుత్తా పద్మ, క్రీడా బోర్డు కార్యదర్శి డాక్టర్ కె రామసుబ్బారెడ్డి అభినందించారు.



క్రికెట్ విజేతలతో వైవీయూ రిజిస్ట్రార్ పుత్తా పద్మ

న్యాయ సహాయాన్ని వినియోగించుకోవాలి

కడప అర్బన్: కడప పురుషుల కేంద్ర కారాగారం, ప్రత్యేక మహిళా కారాగారాన్ని సోమవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్, తమ సిబ్బందితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్, జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం, న్యాయ సహాయం రక్షణ సలహా వ్యవస్థ, పారా లీగల్ వాలంటీర్‌లు, లీగల్ ఎయిడ్ క్లినిక్స్ విధి విధానాలు తెలియజేశారు. ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సహాయంను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం జైలు పరిసరాలను, రిజిస్టర్‌లను పరిశీలించి తగిన సూచనలు సలహాలను ఇచ్చారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్:15100 పై ప్రచారం నిర్వహించారు. మానసిక వ్యాధిగ్రస్తులైన ఖైదీల ఆరోగ్య విషయాల పట్ల ఎప్పటికపుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జైలు సిబ్బందికి సూచించారు. మందులను సక్రమంగా వాడేలా అవగాహన కల్పించాలన్నారు. ఖైదీలకు ఇచ్చే భోజనం, వారికి కల్పిస్తున్న సదుపాయాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కారాగారం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. మహిళా ప్రత్యేక కారాగారంను సందర్శించి మహిళా ఖైదీల ఆరోగ్య విషయాలను, కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.



ప్రత్యేక మహిళా కారాగారంలో సమస్యలను తెలుసుకుంటున్న జడ్జి బాబా ఫక్రుద్దీన్

ఉపాధ్యాయుల అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతాం

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులకు ఉపయుక్తమైన అంశాలను చర్చించి సంఘం ద్వారా ప్రభుత్వానికి తెలియజేస్తామని ఎస్టీయూ కడప రీజియన్ కన్వీనర్ రెడ్డెన్న పేర్కొన్నారు. కడపలోని ఎస్టీయూ భవన్‌లో సోమవారం బదిలీ యాక్టుపై అభిప్రాయ సేకరణలో భాగంగా కడప రూరల్, అర్బన్ రీజియన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పటి నుంచో ఉపాధ్యాయ సంఘాలు కోరుకుంటున్నటువంటి బదిలీ యాక్టును ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. అందులోని అంశాలను క్షుణంగా పరిశీలించి ఉపాధ్యాయులకు ఉపయోగపడే అంశాలను జిల్లాశాఖకు తెలియచేసే విధంగా చర్చ చేయడం జరుగుతుందన్నారు. ఇందులో ఉపాధ్యాయులకు ఉపయుక్తమైన అంశాలను చర్చించి సంఘం ద్వారా ప్రభుత్వానికి తెలియచేస్తామన్నారు. ఉపాధ్యాయులందరికీ ఆయోద్యయోగ్యమైన బదిలీల యాక్టును విడుదల చేసేందుకు ఎస్టీయూ సంఘం ప్రధాన పాత్ర పోషించిందన్నారు. జిల్లా అధ్యక్షుడు ఇలియాష్‌బాష, రాష్ట్ర బాధ్యులు సురేష్‌బాబు, బాలగంగిరెడ్డి, జిల్లా బాధ్యులు సుదర్శన్‌రెడ్డి, హరినాథబాబు, వెంకటసుబ్బయ్య వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాధిక్, సంజీవరాయుడు, కరీముల్లా, శ్రీనివాసులు, వెంకటరమణ, కృష్ణానాయక్ తదితరులు పాల్గొని ఉపాధ్యాయ బదిలీయాక్ట్ 2025పై చర్చించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కడప రీజియన్ కన్వీనర్ రెడ్డెన్న

బడ్జెట్‌పై శాసనసభలో స్పందించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: రాష్ట్ర బడ్జెట్‌పై శాసనసభలో ప్రజా ప్రతినిధులు స్పందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కడప జిల్లా పట్ల వివక్ష చూపారని సోమవారం నగరంలోని అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ రాయలసీమ సాగునీటి వనరుల అభివృద్ధికి రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం అన్యాయమన్నారు.రాయలసీమ పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి రాష్ట్ర బడ్జెట్‌లో 10శాతం నిధులు కేటాయించి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా కార్యదర్శులు బి.మనోహర్, దస్తగిరి రెడ్డి,అన్వేష్, డీవైఎఫ్ఐ యువజన సంఘం జిల్లా కార్యదర్శి శివకుమార్, నగర కార్యదర్శి విజయ్, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఐఎన్ సుబ్బమ్మ, సీఐటీయూ నాయకుడు రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న రెండవ అదనపు జిల్లా జడ్జి కె.సత్యకుమారి

ప్రొద్దుటూరు క్రైం : లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని రెండవ అదనపు జిల్లా జడ్జి కె సత్యకుమారి తెలిపారు. మండల న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 8న జరగబోవు జాతీయ లోక్‌అదాలత్ విషయమై సోమవారం పోలీసు అధికారులతో జడ్జి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ కేసులు సత్వర న్యాయ పరిష్కారం కోసం కక్షిదారులతో మాట్లాడి రాజీకి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ఎంఎస్ ఫైజున్నీసా, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆర్ హారిక, డీఎస్పీ భావన, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

9న ఆర్యవైశ్యసభ సమావేశం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో ఈనెల 9న ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రత్యేక సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు బుశెట్టి రాంమోహన్‌రావు, కార్యదర్శి మురికి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో ఆర్యవైశ్యసభకు దసరా రుసుం పెంపు విషయంపై చర్చించడం, అమ్మవారిశాలలోని నగరేశ్వర స్వామి సన్నిధిలో స్ఫటిక లింగం ఏర్పాటు, అమ్మవారికి రోజు ఉదయం 9.30 నుంచి 10.30 గంటలకు బంగారు పుష్పాలతో అర్చనపై చర్చ, గతంలో చేయించిన బంగారు, వెండి పుష్పాల అమ్మకంపై చర్చించుట, సభ ఎన్నిక నియామావళి తేదీలను మార్పు చేయు విషయం తదితర అంశాలపై చర్చిస్తారని వారు వివరించారు. ఆర్యవైశ్య సభ్యులందరు పాల్గొనాలని కోరారు.

వన్యప్రాణుల సంరక్షణకు తోడ్పడాలి

సిద్దవటం: వన్యప్రాణుల సంరక్షణకై ప్రతి ఒక్కరూ తోడ్పడాలని సిద్దవటం రేంజర్ కళావతి తెలిపారు. ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా సోమవారం సిద్దవటం రేంజిలోని సిద్దవటం బీటు కపర్దీశ్వరుని కోన అటవీ ప్రాంతంలో సిద్దవటానికి చెందిన శ్రీ నలంద హైస్కూల్ విద్యార్థులకు వన్యప్రాణులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రేంజర్ మాట్లాడుతూ వన్యప్రాణులకు భూమి మీద స్వేచ్ఛగా జీవించే హక్కు ఉందని వన్యప్రాణులకు హాని కలిగించకుండా ప్రతి ఒక్కరూ తోడ్పడాలన్నారు.

వన్యప్రాణులకు ముప్పు వాటిల్లే కార్యక్రమాలను చేయకూడదని సూచించారు. గ్రామాల్లో వన్యప్రాణులు కనబడితే అటవీ అధికారులకు వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. హాని చేయకూడదన్నారు. లంకమల అటవీ ప్రాంతంలో నిప్పు పెట్టడం వల్ల వన్యప్రాణులకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. వాటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ అటవీ ప్రాంతం పచ్చదనంగా ఉండేలా చూడాలని విద్యార్థులకు, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అవగాహన కల్పించామని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంటు వెంకటసుబ్బయ్య, విద్యార్థులు, అటవీ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నగదు చోరీ

సుండుపల్లె : సుండుపల్లి నుంచి తమ గ్రామానికి గంగిరెడ్డి గారి పల్లి (కుంటల ముందర) కు వెళ్తుండగా గుర్రప్ప చెరువు వద్ద ముగ్గురు వ్యక్తులు అడ్డగించి తన వద్ద నుండి రూ.10 లక్షలను దొంగలించారాని బాధితుడు వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. స్థానిక పోలీసులకు సమాచారం తెలుపగా ఎస్‌ఐ ముత్యాల శ్రీనివాసులు తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని బాధితున్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంఘటనా స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు.

ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చర్యలు తప్పవు

బద్వేలు అర్బన్ : పట్టణంలోని హోటళ్లలో ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని పలు హోటళ్లను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఆయా హోటళ్లలో ప్లేట్లపై, పార్సిల్‌లకు, ఇడ్లిపాత్రలలో ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తుండటం గమనించి సంబంధిత హోటల్ యజమానులకు హెచ్చరికలు జారీ చేయడంతోపాటు పోరుమామిళ్ల రోడ్డులోని ఓ హోటల్ నిర్వాహకుడికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని హోటళ్లలో ప్లేట్లలో, ఆహార పదార్థాలు పార్సిల్ చేయడానికి ప్లాస్టిక్ కవర్లకు బదులుగా విస్తరాకులు గాని అరటి ఆకులు గాని వాడాలని సూచించారు. శానిటేషన్ సెక్రటరీలు తమ పరిధిలోని హోటళ్లను తరచూ తనిఖీలు చేస్తుండాలని సూచించారు. ప్లాస్టిక్ కవర్లు వాడడం వల్ల పలు అనర్థాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటేషన్ సెక్రటరీలు, ప్రజారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.